# పిచ్చి కుదిరింది...
# రోకలి తలకు చుట్టు...

- గుమ్మా నిత్యకళ్యాణమ్మ.



జో గారావుకి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. రేపు ఆఫీసులో దొరకబోయే ఆ నాలుగు వందల రూపాయలూ అతని కళ్లముందు కనిపిస్తున్నాయి. ఒకసారి సరికొత్త కరెన్సీ నోట్లలాగా, వేరొకసారి సఫారీ సూట్ రూపంలోనూ, సఫారీ సూట్‌లో తన అందం వెలిగిపోవడం ఖాయం.

అతనికి ఎన్నాళ్లబట్టో ఒక కోరిక వుంది.

ఆ డబ్బుతో సఫారీ సూటు కుట్టించుకోవాలని అతను నిశ్చయించుకున్నాడు.

కాంతంతో తన మనోభీష్టాన్ని చెప్పి నాలుగైదు వందలు శాంక్షన్ చేయమని ప్రాధేయపడ్డాడు.

'అయ్యో! మీరింకా బాలాకుమారులా, లేక కొత్త పెళ్లికొడుకు అనుకుంటున్నావా? ఈ వయసులో ఆ వేషాలు ఏమిటి? సఫారీ వేసుకోకపోతే ఆ లేడీ టైపిస్టు మీతో ప్రేమగా మాట్లాడనందా? ఆ వన్నెలాడి చేత ఆకర్షింపబడాలనే కదా మీరు సఫారీ వేసుకోవాలనుకుంటున్నారు? ఆ పప్పులేం ఉడకవు. మీరు శ్రీరామచంద్రుడిగానే బాగుంటారు. కృష్ణ పరమాత్మ అవతారం ధరించాలని అనుకోకండి. మీరు వెలిగిస్తున్నది బోడి గుమాస్తా ఉద్యోగం. గెజిటెడ్ ర్యాంకుకి ఎలాగూ ప్రమోషన్ రాదు. మరి ఈ షోకులెందుకు?'

'కాంతం! నువ్వు నెలకొక చీర కొనుక్కుంటున్నావు. నేనెప్పుడైనా అభ్యంతరం చెప్పానా? అసలు సంపాదిస్తున్నది నేను. సొమ్మొకడిది-సోకొకడిది- అన్నట్లు నువ్వు కొత్త కొత్త బట్టలేసుకుని ఊరిమీద బలాదూరులా తిరుగుతావు. గుమాస్తాగాడి పెళ్లానివి- మరి నీకు షోకులెందుకు?'

'అలా అడిగారు- బాగుంది. మన పెద్దలు ఓ మాటన్నారు- మీకు తెలుసా?'

'ఎన్నో అని వుంటారు. అవన్నీ ఎవరికి గుర్తుంటాయి? ఇప్పుడు నువ్వు చెప్పదల్చుకున్నదేమిటి?'

'ఆడదాని వయసు అడగకూడదు. అడిగినా ఏ ఆడదైనా ఓ అయిదో, పదిహేనో తగ్గించి చెప్తుంది. వయసు కనిపించకుండా వుండాలంటే మంచి బట్టలుండాలి. నేను కొత్త చీర కట్టుకుంటున్నది నా తృప్తి కోసమా? ఇరుగుపొరుగు వాళ్లు నన్ను చూసి కళ్లు కుట్టుకోవాలని. ఫలానా జోగారావుగారి పెళ్లాం ఎంత ఖరీదైన చీరలు కట్టుకుంటుందో- ఆ భాగ్యం మాకు లేదని అసూయపడాలని. నేను చింకి చీరలు కట్టుకు తిరిగితే లోకం నన్నేమీ అనదు- మిమ్మల్ని దెప్పిపొడుస్తుంది. నా భర్తను ఎవరైనా అలాగంటే నేను విని సహించగలనా? మొన్నటికి మొన్న ఒక పార్టీలో అడిగింది- 'కాంతంగారూ! మీకు ఇరవై ఎనిమిది వెళ్లి ఇరవై తొమ్మిది వచ్చిందా, లేక ఇరవై తొమ్మిది వెళ్లిందా' అని. ఆ మాట మీరు విని వుంటే ఎంత గర్వపడేవారు!'

'కాంతం! ఆ సంగతులకేం- నాది ఒకే ఒక్క కోరిక. సఫారీ వేసుకోవాలని ఎంతో ముచ్చటగా వుంది. పోనీ కాంతం ఒక అయిదు వందలు నాకు అప్పుగా ఇవ్వు.'

'అప్పుగా ఇవ్వాలా? ఎలా తీరుస్తారు?'

'కాంతం! నా జేబుఖర్చుకని రోజూ కొంత ఇస్తున్నావుగా! జేబుఖర్చు తగ్గించుకుని నీ బాకీ తీరుస్తాను.'

'ఏమన్నారూ! మీరు జేబుఖర్చు తగ్గించుకుని బాకీ తీరుస్తారా? అంటే ఇప్పుడు నేను మీకు ఇస్తున్న డబ్బు ఎక్కువన్న మాట. రేపటి నుంచి మీ జేబుఖర్చులో యాభై శాతం కట్' అంది కాంతం.

జోగారావు ఆ మాట అన్నందుకు బాధపడ్డాడు. ఆమె రోజూ ఇచ్చే పది రూపాయలే చాలటం లేదు. ఇకమీదట అయిదు రూపాయలతో బస్సులో వెళ్లగలడా... కనీసం రెండుమార్లు ఆఫీసులో టీ త్రాగగలడా?'

కాంతం ఆడిన మాట జవదాటే మనిషి కాదు.

'కూన పెరిగితే కుండ పెరుగుతుంది. గొర్రె తోక లాంటి మీ సంపాదనతో ఈ సంసారం ఈదడం నా తరం కాదు. ఇంటిలో అందరూ దుబారా ఖర్చులు చేస్తే ఎలా? ఇంటి యజమాని మీరు- మీకు బాధ్యత తెలియదా?'

ప్రతినెలా ఫస్టు తారీఖున జీతంతోపాటు పే స్లిప్‌ను కూడా కాంతం చేతిలో పెట్టాలి. పే స్లిప్‌ను చూస్తుంది, నోట్లు లెక్కపెడుతుంది. 'ఏమిటో ఆఫీసుని మీరే మోస్తున్నట్లు ప్రగల్భాలు పలుకుతారు. ఒక ఇంక్రిమెంట్ లేదు, ఒక ప్రమోషన్ లేదు' అంటుంది. ఆమె డబ్బు చేతిలో పెట్టి ఫలానాది తెండి- అంటే అదే తేవాలి. స్వంత బుర్ర ఉపయోగించి ఏదీ కొనలేదు. ఆఫీసు నుంచి వచ్చిన తరువాత ఆ రోజు భర్త ఏం ఖర్చు చేశాడో అడుగుతుంది. ఒక రూపాయి మిగిలిందని తెలిస్తే- ఠక్కున తీసుకుంటుంది.

జోగారావు ఈ విషయాలు ఎవరితో చెప్పుకోగలడు?

'నాన్నా! కాంతం తత్వం తెలిసి కూడా నాకెందుకు దాన్ని కట్టబెట్టారు? నాది బానిస బ్రతుకైంది' అంటాడు తండ్రితో.

'మేనరికంరా! కాదంటే మీ అమ్మ ఉరిపోసుకు చస్తానంది. అయినా మీ ఆలూమగల తగవుల్లో నేను తలదూర్చలేను. మీ మామయ్యకు చెప్పి చూడు. అతడేమైనా కూతురికి బోధపరుస్తాడేమో!'

అక్కడా పరాభవమే కానీ ఫలితం శూన్యమైంది.

'ఒరేయ్ నాగన్నా! ఆ డబ్బు దాని ముఖాన పారేస్తున్నావు. అంటే ఎంతో సుఖాన్ని కొనుక్కుంటున్నావు. అదే జీతం డబ్బులు పెళ్లాం చేతికివ్వక నువ్వే ఖర్చుపెట్టావనుకో. అప్పుడు నీ భార్య, అది లేదు- ఇది లేదు- అని జోరీగలా నువ్వు ఇంట్లో వున్నంతసేపూ పోరుతుంది. పాలవాడూ, కిరాణావాడూ ఏం ఖర్మ- ఆఖరికి పాచిపని చేసేది కూడా నీ మీదకు దండెత్తుకు వస్తూ వుంటారు. వేం అనుభవిస్తున్నాం చాలదూ? మరో మాట స్వభావరీత్యా మగవాళ్లు దుబారా చేస్తారు. ఏ ఖర్చు చేయాలో ఏది మానాలో వారికి తెలియదు. అప్పుడేం జరుగుతుంది? అప్పుల ఊబిలో కూరుకుపోయి పాత అప్పుల వడ్డీలు తీర్చడానికి కొత్త అప్పులు చేస్తావు. నా కూతురని కాదు కానీ కాంతం నీకే టెన్షన్లూ లేకుండా చేస్తున్నది.'

ఆ పిల్లకు తండ్రే దాన్ని సమర్ధించకుండా వుంటాడా?!

డి.ఏ., ఎరియర్స్ వచ్చినా, ఇంక్రిమెంట్ బకాయి అందినా అది భార్య దగ్గర దాచలేదు. మళ్లీ నెల పే స్లిప్‌లో పెరిగిన మొత్తాలుంటాయి. ఈ డబ్బు అలాంటి బాపతు కాదు. మూడేళ్ల క్రితం ప్రభుత్వోద్యోగులు స్ట్రయిక్ చేశారు. ప్రభుత్వం వీరి డిమాండ్ల విషయం పట్టించుకోలేదు. తక్షణం డ్యూటీలో చేరకపోతే ఉద్యోగాలు ఊడబెరుకుతాం అంది. దాంతో తోక ముడిచి అందరూ డ్యూటీలకు వెళ్లారు. ఆ ఆరు రోజుల జీతం కోత కోసింది. ఇప్పుడా ప్రభుత్వం పడిపోయింది. ఇంతకాలం అపోజిషన్‌లో వున్నవాళ్లు అందలం ఎక్కారు. కొత్త ముఖ్యమంత్రి ఉద్యోగులకు తాయిలంలా ఆ ఆరు రోజుల జీతం తిరిగి ఇవ్వమని ఆదేశాలిచ్చారు. కాంతానికి ఈ విషయం తెలిసే అవకాశాలు లేవు.

జోగారావుకి తను సఫారీ కుట్టించుకుంటే అది భార్యకు తెలిసిపోతుందని, అప్పుడు తనను నిలదీస్తుందని తెలుసు.

అలా అడిగితే- అప్పుడేం చెప్పాలో అది మాత్రం అతనికి తెలియదు.

'తాంబూలాలిచ్చేశాను, తన్నుకు చావండి' అని వెనకటికెవరో అన్నట్లు ప్రవర్తిస్తే సరిపోదా అని అనుకున్నాడు.

❖ ❖ ❖

'జోగారావు గారూ! ఈ నాలుగు వందలూ ఏం చేస్తారు? అయ్యో! నాదెంత వెర్రి ప్రశ్న? ఆఫీసులో దొరికిన డబ్బు పువ్వుల్లో పెట్టి మీరు మీ భార్య చేతికిస్తారట కదూ? గడించేవారు మీరు- మీ డబ్బు మీరు ఖర్చుపెట్టుకోవాలండీ! ఇంత విధేయత మీలోనే చూశాను' అన్నాడు క్యాషియర్ డబ్బు ఇస్తూ.

'అదేం కాదు. ఈ డబ్బుతో సఫారీ సూట్ కుట్టించుకోవాలను కుంటున్నాను' అన్నాడు గర్వంగా జోగారావు.

'మంచి నిర్ణయం. మావాడు ఈ మధ్యనే పి.ఎం.ఆర్.వై. లోన్ తీసుకుని బట్టలషాపు తెరిచాడు. పెద్ద వ్యాపారులున్నారే వాళ్లు పచ్చి మోసగాళ్లు. అడ్డకు పడ్డా తీసుకుంటారు. మోసపోవడానికి వాళ్ల వద్దకే వెళ్లాలా, మావాడి షాపుకి వెళ్లండి. ఇదిగో మావాడి అడ్రస్' అన్నాడు క్యాషియర్ ఒక స్లిప్ ఇస్తూ.

తలనొప్పిగా వుందన్న సాకు చెప్పి అరగంట ముందే ఆఫీసులో సెలవు తీసుకుని తిన్నగా క్యాషియర్ చెప్పిన అడ్రస్‌కి వెళ్లాడు.

లేత నీలం రంగు బట్ట జోగారావుకి నచ్చింది.

'మీ సెలక్షన్‌కి మెచ్చుకోవాలండీ. ఎంత మంచి కలర్ సెలక్ట్ చేశారు. మూడు మీటర్లు ఉండాలి. మూడు వందలే అవుతుంది. అయ్యో! కొన్న ధరకే ఇస్తున్నానండీ మీకు కాబట్టి. ఇంకొకరికైతే నాలుగు వందలకు ఒక్క రూపాయి తక్కువ ఇచ్చినా ఈ బట్ట ఇవ్వను. తమరి దగ్గర ఎక్కువ ఎలా తీసుకుంటాను?'

క్యాషియర్ తను వస్తున్న విషయం చెప్పివుంటాడు. అందుకే ఇతడు తనకు కాబట్టి చౌకగా ఇచ్చాడని మురిసిపోయాడు. అయితే ఆ సంతోషం ఎంతోసేపు మిగల్లేదు. ఇంతలో వేరే కస్టమర్‌తో అవే మాటలన్నాడతను.

'మీకు కాబట్టి కొన్న ధరకే ఇస్తున్నాను' అనడం వాళ్ల వ్యాపార కిటుకు కాబోలు. క్యాషియర్ నిజమే చెప్పాడు- 'మోసపోవడానికి ఎవరి దగ్గరకో ఎందుకు? మావాడి దగ్గరకే వెళ్లండి' అని.

ఏది ఏమైతేనేం కొనడం కార్యక్రమం ముగిసింది.

నాలుగైదు టైలరింగ్ షాపులకు వెళ్లాడు. కుట్టుకూలీ నూట ఇరవై నుంచి నూట అరవై వరకు వాళ్లు చెప్పారు. జోగారావు దగ్గర మిగిలినవి నూరు రూపాయలే. సందుగొందులన్నీ తిరగ్గా ఓ టైలర్ నూరు రూపాయలకు కుట్టడానికి ఒప్పుకున్నాడు. కొలతలు తీసుకున్నాడు.

'ఆదివారం తప్పక ఇచ్చేయాలి. సోమవారం నేనో పెళ్లికి వెళ్లాలి' అన్నాడు జోగారావు. ఎందుకైనా మంచిదని కుట్టుకూలీ మొత్తం అడ్వాన్స్‌గా ఇచ్చేశాడు టైలరుకి. ఆ డబ్బు తన దగ్గర ఉంచుకోవడం ప్రమాదం. కాంతం కన్ను పడకుండా దాని తను దాచలేదు.

ఒక ఆదివారం వెళ్లిపోయింది. రెండో ఆదివారం కూడా వెళ్లిపోయింది. మూడో ఆదివారం ఇదిగో వస్తాను, అదిగో వస్తాను అంటున్నది. టైలరు ఎక్కడైనా నిలబడగలడేమో కానీ మాట మీద నిలబడలేదు.

'నేను మెతకవాడినని నీవనుకుంటున్నావు. నాకు కోపం వస్తే నేను మనిషిని కాను. రేపు సాయంత్రానికి కుట్టి ఇవ్వకపోతే...' ఆ తరువాత ఆ వాక్యం ఎలా పూర్తిచేయాలో జోగారావుకి తెలియక మధ్యలోనే తుంచేశాడు.

జోగారావుకి ఒకటి మాత్రం తెలుసు- ఆ గడువులో ఇవ్వకపోతే వాడు ఇచ్చేవరకు వాడి దుకాణంలో ఎటెండెన్స్ రోజూ వేయించుకోవాలని. అంతకుమించి అతనేం చేయలేడు.

అయితే, అలాంటి అవసరం రాలేదు. బహుశా వాడు భయపడ్డాడో, పని లోడ్ తగ్గిందో వాడు సఫారీ కుట్టి ఇచ్చాడు. ఫిటింగ్స్ సరిపోయాయో లేదో అని జోగారావు అక్కడే వాటిని వేసుకుని నిలువుటద్దంలో చూసుకున్నాడు.

జోగారావుకి ముందుగా ఆశ్చర్యం వేసిందో, ముందుగా కోపం వచ్చిందో, లేక ముందుగా దుఃఖం వచ్చిందో చెప్పడం కష్టం. మూడూ ఏకకాలంలో ఏక పరిమాణంలో వచ్చి వుంటాయంటే అది అతిశయోక్తి కాదు. సఫారీ ధరించాన్న ఉత్సాహం పేలవిండిలా ఎగిరిపోయింది. నోటమాట రాలేదు. కంటి వెంట నీళ్లు మాత్రం వచ్చాయి.

'టైలరూ! ఇదేంటి ఇంత లూజ్‌గా వున్నాయి. ఇందులో మరొక మనిషి దూరగలడు' అన్నాడు కొంతసేపటికి తేరుకుని.

ఆ టైలరుకి డబ్బులేనాడో ముట్టాయి. వాడు చిద్విలాసంగా ఉన్నాడు.

'నా తప్పు లేదు సార్! మీ కాళ్లూ చేతులూ పొడుగు తీసుకుని పుస్తకంలో వున్న కొలతల ప్రకారమే కుట్టాను. మాస్టారూ! మీరు

## తీర్చుకోలేని ఋణం

పసిపాపకు ఏం పెట్టినా తినటం తప్ప అదేమన్నది ఎరుగదు. అలా అమ్మా నాన్నల పెంపకంలో పెరిగి పిదప, ఉపాధ్యాయుల అధ్యాపనంలో సాన దేరి, చివరకు ఉద్యోగాన్వేషణలో, ఎన్నో అవకతవకలు ఎదుర్కొని గెలిచి ఒక యింటివారై, తిరిగి వారి పిల్లాపాపల పెంపకంలో విసిగి వేసారి నప్పుడు గాని తెల్సుకోలేరు! వారి తల్లిదండ్రులు పిల్లలను ఒక స్థాయికి తెచ్చుటకు ఎన్ని శ్రమలు, ఎన్ని యిబ్బందులు పడ్డారు అన్నది. ఆ నిజం తెల్సుకొనే లోపున దైవ స్వరూపులైన అమ్మా నాన్నలు కనుమరుగవుదురు కదా! నిజంగా చెప్పాలంటే తీర్చుకోలేనిది తల్లిదండ్రుల ఋణం!

-మౌనేశ్వరీదేవి

చీపురుకట్టలా సన్నగా ఉన్నారు. జండా కొయ్యలా పొడుగంటే వున్నారు కానీ దానికి తగ్గట్టు బాడీ ఏది? నిజం చెప్పాలంటే చూసినవాళ్లు మిమ్మల్ని టి.బి. పేషెంటు అనుకుంటారు. ప్రస్తుతానికి మీకిప్పుడు టి.బి. లేకున్నా రేపు అటాక్ కావచ్చు. భయపడకండి. మాది ఆయుర్వేద కుటుంబం. మా తాత తండ్రులు ఆయుర్వేద శిఖామణులు. కులవృత్తికి రోజులు కావివి. ఈనాడు ఇంటికో డాక్టరు, వీధిలో నాలుగు నర్సింగ్‌హోములూ. అందుకే వాళ్లతో పోటీపడలేక టైలరింగ్ షాపు పెట్టుకున్నాను. అయితే పార్ట్‌టైమ్‌గా ఆయుర్వేదం చేస్తున్నాను. లావు అవడానికి నా దగ్గర మంచి ఔషధం వుంది. రెండు పూటలా ఈ మందు పాలతో సేవించండి. అయిదు రోజుల్లో గుణం కనిపిస్తుంది. అప్పుడు ఈ సూట్ మీకు సరిగ్గా ఫిట్ అవుతుంది' అంటూ డ్రాయరు సొరుగులోంచి పది పొట్లాలు తీసి ఇచ్చాడు. 'మీకు ఉచితంగానే ఇస్తున్నాను' అన్నాడు.

కాంతం ముందు తను దుర్బలుడు. ఆవిడ చూడబోతే రోడ్డు రోలరులా వుంటుంది. ఇదీ తన మంచికే. తనూ ఆమెలా లావుగా వుంటే తన మీద కాంతం అధికారం చెలాయించలేదు. తనంటే భయపడుతుంది.

కానీ టైలరుదంతా పచ్చి మోసం. ఆ మందు అసలు పనిచేయలేదు. జోగారావు శరీరంలో ఏ మార్పూ రాలేదు. వాడిని కడిగేయాలనుకుని పనిగట్టుకు వెళ్లాడు.

జోగారావు వెళ్లేసరికి ఎవరో కస్టమర్ వాడితో తగవు పడుతున్నాడు. వారిద్దరి మధ్యకు వెళ్లడం ఎందుకు అని అక్కడ బెంచీ మీద కూర్చున్నాడు.

కొలతలు తీసుకుని మరీ ఇంత టైట్‌గా కుట్టావు. ఇవి నాకు ఎక్కడం లేదు అనేది ఆ కస్టమర్ ఫిర్యాదు.

టైలర్ ముఖంలో వెనుకటి చిద్విలాస ముద్రే.

'నా మాట వింటారా? ఆఫీసులో లంచాలు మీకు భారీగా దొరుకుతూ వుండవచ్చు. అందువల్ల ఆ గడ్డి మేసి శరీరాన్ని ఇలా భారీగా పెంచుకోవాలా? లంచం డబ్బును బాత్రూంలోనూ, పరుపుల్లోనూ, లాకర్లలోనూ దాచవచ్చునని మీకు తెలియదా? తెలియకపోవడం వలననే దొరికింది దొరికినట్లు మింగేసి ఇంత లావయ్యారు. భారీ శరీరం వున్న వాళ్లకే బి.పి. వస్తుంది. హార్ట్ అటాక్ వస్తుంది. ఈ డాక్టర్లు మీ జబ్బుని నయం చేయరు. మీ కష్టార్జితాన్ని దోచుకుంటారు. ఆ డబ్బులు వచ్చే అవకాశం మాత్రం వుంటుంది. నేనిలా అంటున్నానని మీరు భయపడకండి. నా దగ్గర ఆయుర్వేదం మందు వుంది. అయిదు రోజులు రెండు పూటలా ఆ మందు వాడారంటే మీ శరీరంలోని లావు తగ్గుతుంది. అప్పుడు ఈ సూటూ మీకు సరిపోతుంది. మీ ఆరోగ్యం కూడా చక్కబడుతుంది. ఆహా ఆ మందుకి మీరు వేరే డబ్బు ఇవ్వనక్కరలేదు.'

మరి వాడితో మాట్లాడటం వ్యర్థమనిపించింది జోగారావుకి.

ఇంటికి వస్తున్న జోగారావు బుర్రలో ట్యూబ్‌లైట్ వెలిగింది. ప్రతీవాడూ తప్పనిసరిగా అండర్ గార్మెంట్స్ వేసుకుంటాడు. ఆ డ్రాయరూ, బనియనూ బయటకు కనిపించవు. ఈ సఫారీ సూట్ వేసుకుంటే లోపలనున్న తన ప్యాంటూ, షర్టూ కనిపించవు. అప్పుడు కాంతం కళ్లుగప్పి దీనితో తిరగొచ్చు. వీధిలోకి వచ్చిన తరువాత ఏ చెట్టుచాటునో నిల్చుండి వీటిని వేసుకుంటాడు. బట్టలు ఇవ్వాల్సిన అవసరం వుండదు. ఇంటికి వచ్చేటప్పుడు బయటే వీటిని తీసేస్తాడు. లూజ్‌గా వున్న బట్టలూ ఫ్యాషనే.

❖ ❖ ❖

'కాంతం! నేను ఆఫీసుకెళ్తున్నాను' అని చెప్పి బయలుదేరాడు. రోడ్డు చివర ఓ చెట్టుచాటున నిల్చుండి సంచీలోని సఫారీ తీసివేసుకున్నాడు. ఆ నీలం రంగు బట్టలను చూసి మురిసిపోయాడు.

దారిలో అందరూ జోగారావుని వింతగా చూస్తూ వుంటే తన డ్రెస్‌లోని ఛేంజ్‌ని చూసి ముచ్చటపడుతున్నారనుకున్నాడు. ఆఫీసుకి వెళ్లిన తరువాత అసలు బండారం బయటపడింది.

జోగారావుకి అప్పటికే చాలా నిక్‌నేమ్స్

వున్నాయి. బఫూన్ అన్న కొత్త బిరుదును పద్మశ్రీలా తగిలించి మిత్రులు గోల చేశారు.

అందరూ అపహాస్యం చేసినవాళ్లే వుండరు. సానుభూతిపరులు కూడా కొంందరుంటారు. ఆ కోవలోని వాడు షణ్ముగం.

'గురూ! దీనికింత బెంగ దేనికి? కొన్ని బట్టలు ఉతికితే కుంచించుకు పోతాయి. చాకలివాడికి వేసి చూడు- నీ అదృష్టం బాగుంటే ఇది ష్రింక్ అయి నీకు సరిపోతుంది' అన్నాడు షణ్ముగం.

ఆ సాయంత్రమే జోగారావు ఆ సలహాను అమలుపరిచాడు. చాలాసేపు కారంలో ఉడకబెట్టి బాగా ఉతికి ఇస్త్రీ చెయ్యి అన్నాడు. చాకలివాడు మర్నాడు రమ్మన్నాడు.

మర్నాడు చాకలివాడు ఇచ్చిన బట్టలు చూసి ఆశ్చర్యపోయాడు.

'ఇవి నేను వేసినవి కావు. నేను వేసింది మంచి జత. అవి దాచేసుకుని వేరెవరిదో ఇస్తావేం?' అన్నాడు కోపంగా.

'బాబూ! ఇవి మీరు వేసినవే!'

'నేను నీలం రంగువి వేశాను. ఇవి తెల్లగా మసకబారి వున్నాయి. నావంటే ఎలా నమ్మను?'

చాకలివాడు పకాలున నవ్వాడు.

'అదా బాబూ! నాసిరకం బట్టలు ఉడకబెడితే రంగు పోతాయి. ఇంత నాసిరకంవి ఎలా కొన్నారు? ఈ కుట్లన్నీ నీలంగా తళతళా మెరుస్తున్నాయి. బట్ట తెల్లదైతే ఎవరైనా నీలం దారంతో కుడతారా? బట్ట రంగు పోతే నన్ను గదుముతారెందుకు? ఏ దుకాణంలో కొన్నారో వాడినడగండి.'

వాడు చెప్పిందీ నిజమే. టైలరు వాడిన దారం రంగు అలాగే వుంది. వాడు చెప్పినట్లు బట్టల దుకాణానికి వెళ్లాడు.

జోగారావు చెప్పిందంతా షాపువాడు ఓపికగా విన్నాడు.

'మాస్టారూ! బయట నోటీసు చూడలేదా?'

'ఏ నోటీసు? ఏమని వుంది?'

❖ ❖ ❖

జోగారావు చదివాడు- 'ఫ్యాషన్లు మితిమీరిన ఈ రోజుల్లో బట్ట నాణ్యత, రంగు, మన్నికలకు మేం గ్యారంటీ ఇవ్వలేం. మీరు ఎంపిక చేసుకున్న వాటికి మీరే బాధ్యులు.'

జరిగిందంతా షణ్ముగానికి చెప్పాడు.

'నువ్వేం విచారించకు. టైలర్లు పొట్టి వాటిని పొడుగు చెయ్యలేరు. టైట్ వాటిని లూజ్ చెయ్యలేరు. కానీ లూజ్ బట్టల్ని టైట్ చేయగలరు. అది టైలర్లకు బ్రహ్మవిద్య కాదు. రేపు నీ సఫారీని తీసుకురా. మా టైలర్ సరిచేస్తాడు' అన్నాడు షణ్ముగం.

అయితే ఆ ముందురోజు పానకంలో పుడకలాగా కాంతం తమ్ముడు వచ్చాడు. వాడెన్నోమార్లు వస్తాడు, ఎన్నోమార్లు పోతాడు. బావమరిదిని జోగారావు ఏనాడూ పట్టించుకోలేదు. ఈ పర్యాయం వాడి రాక వలన ఒక ప్రమాదం దాపురించింది.

'కాంతం! ఈ బీరువా కింది అరలో నా సఫారీ సూట్ వుండాలే!'

'మీకు పిచ్చెక్కిందా? మీకు సఫారీ సూటా?'

'అదంతా తర్వాత చెప్తాను. అది కనిపించడం

## తెలుగింటి ఆనవాలు

వాకిట్లో వెలసిన వైద్యరాజు
'వేప'
పెరట్లో తలమునకలుగా
'మునగ'
పసుపు కుంకుమల తల్లి
'తులసి'
పచ్చని సంసారంలా విస్తరిల్లిన
'బాదం'
వంటింటి గూనకప్పుపైన గుండ్రంగా ఒదిగిన
'ఆనప'
చేతికందివచ్చిన కరివేపాకు మొక్కా
రాత్రి తలగడ నానుకుని విసనకర్రై వీచే
కొబ్బరి గాలీ
తెలుగింటి ఆనవాలుకు ఇంతకన్నా
ఏం కావాలి?

– పి. రామ్‌నారాయణ్.

లేదు. నువ్వుకానీ కింది అర జోలికి వెళ్లావా?'

'మా తమ్ముడొచ్చాడుగా... వెళ్లిపోతూ– 'అక్కా.. నా దగ్గర బట్టలు ఎక్కువైపోయాయి. పెట్టె పట్టడం లేదు. ఒక జత వదిలేస్తున్నాను. ఏ ముష్టివాడికైనా ఇచ్చేయి' అన్నాడు. బీరువా కింద అరలో పడేయమన్నాను. అయ్యో! ముష్టివాడికిస్తే మనకేం లాభం? వాడొదిలేసిన రెండు ప్యాంట్లూ, రెండు చొక్కాలూ స్టీలుసామాను వాడికిస్తే ఒక ప్లేటు ఇచ్చాడు.'

కాంతం లోనికి వెళ్లి ఒక ప్లేటు తెచ్చి భర్తకు చూపించింది.

'కాంతం! మీ తమ్ముడు ఒక చొక్కా ఒక ప్యాంటూ వదిలేస్తున్నాడంటే– నువ్వు రెండేసి స్టీలు సామానుల వాడికిచ్చావా? అందులో ఒక చొక్కా ప్యాంటూ నావి.'

'అయ్యో! వాడు ఒక జత అన్నాడండీ. జత అంటే రెండు కాదా?'

'గోవిందా!'

'నాలుగు వందల రూపాయలకు కాళ్లు వచ్చాయి' స్వగతమైనా బయటకే అనేశాడు.

కాంతం రెచ్చిపోయింది. తీగలాగి డొంకంతా కదిలించింది. మొగుడ్ని నానా మాటలూ అంది.

అప్పుడు జోగారావు మదిలో ట్యూబ్‌లైట్ మరోమారు వెలిగింది. 'షణ్ముగం ఏమన్నాడు? టైట్ బట్టలను లూజ్ చేయడం సాధ్యపడదు కానీ, లూజ్ బట్టల్ని టైట్ చేయవచ్చు. కాంతంలాంటి మొండివాళ్లను లొంగదీయడం కష్టం కానీ తనలాంటి మెతకవాళ్లు మొండిగా మారగలరు.'

'షణ్ముగం! నువ్వే ఏదో ఉపాయం చెప్పి పుణ్యం కట్టుకో. కాంతంతో నేను వేగలేకపోతున్నాను. నన్యాసుల్లో కలిసిపోమంటావా? అదీ నాకు సమ్మతమే.'

షణ్ముగం ఆలోచించాడు.

'పిచ్చి కుదిరింది... రోకలి తలకు చుట్టు... అన్నాడట వెనకటికెవరో! ఆ సూత్రం ఇక్కడ వర్తిస్తుందేమో! ఒక ప్రయోగం చేద్దామా?'

'ఒకటి కాదు లక్ష అయినా చేస్తాను.'

ఒకటవ తారీఖున జీతాలు తీసుకోగానే ఇద్దరూ రెడీమేడ్ బట్టల షాపులోకి వెళ్లారు. జోగారావు ఇష్టపడిన నాలుగు జతల సఫారీ సూట్‌లు ప్యాక్ చేయించాడు. బిల్లు పదహారు వందలూ చెల్లించి, మిగతా డబ్బు షణ్ముగం చేతికిచ్చాడు జోగారావు. అక్కడ నుంచి తిన్నగా ఒక క్లినిక్‌కి వెళ్లారు. కాంపౌండర్‌ను బ్రతిమాలి, వాడి చేతికో యాభై రూపాయల కాగితం ఇచ్చి, జోగారావు ఒంటిమీద చిన్న చిన్న గాయాలు చేయించి కుట్లు కట్టించాడు.

జోగారావు రిక్షాలో ఇంటికి వచ్చి– 'కాంతం! దారిలో కొందరు దుర్మార్గులు నన్ను కొట్టి నా జీతం డబ్బు దోచుకున్నారు. ముందు రిక్షా అబ్బికి పది రూపాయలిచ్చి పంపించు' అన్నాడు ఏడుస్తూ నాటకీయంగా.

కాంతం లబోదిబోమంది. ఆ దుర్మార్గులను శాపనార్థాలు పెట్టింది. భర్తను బాగా చూసుకుంది.

ఈ రహస్యం ఎంతోకాలం దాగదని జోగారావుకి తెలుసు, ఆ సలహా ఇచ్చిన షణ్ముగానికీ తెలుసు.

ఆ తరువాత ఏం జరిగిందంటారా?

పోనిస్తురూ!

మొగుడూ పెళ్లాలన్న తరువాత బోలెడుంటాయి.

కాంతం భర్త కోరిక సరియైనదే అని మెత్తబడి వుండవచ్చు.

జోగారావు మొండివాడుగా మారి వుండవచ్చు, లేదా యథాస్థితి కొనసాగుతూ వుండవచ్చు.

అవన్నీ వాళ్ల ప్రయివేటు విషయాలు.

మనకెందుకులెద్దురూ?

అయితే ప్రతీ కథకూ ఒక ముగింపు వుండాలిగా!

'కాంతం పిచ్చి కుదిరింది' అనుకున్నాడు జోగారావు.

'జోగారావు చివరకు రోకలి తలకు చుట్టుకున్నాడు' అనుకున్నాడు షణ్ముగం. ❑